ఘనంగా క్రిస్మస్

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 25 : క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు జిల్లావ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. కొత్త దుస్తులు ధరించి చర్చిల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించి, కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. వర్నిలోని సీఎస్ఐ చర్చిలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జిల్లాకేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నిజామాబాద్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఊట్‌పల్లి చర్చిలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు


నగరంలోని సీఎస్ఐ చర్చిలో వేడుకల్లో పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

జక్రాన్‌పల్లి చర్చిలో వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

సిరికొండలో..

వేల్పూర్ జీసస్ లవ్‌పుల్ గాస్పల్ చర్చిలో ..

నందిపేట్ జుడా చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బోధన్ సీఎస్ఐ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్

పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 25 : నగరంలోని లలితాదేవి ఆశ్రమాలయంలో యశస్విని సాహితీ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ తుంగుడిగె ఫణీంద్ర రాసిన మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి డాక్టర్ ఆయాచితం నటేశ్వర శర్మ హాజరై మాట్లాడారు. సాహిత్య, శాస్త్ర పాండిత్యం ఉన్నవారే అసలైన కవిత్వాన్ని రాయగలుగుతారని, అలాంటి వారే కవులుగా రాణిస్తారని అన్నారు. దివంగత శ్రీధర్‌రావు ద్వితీయ ముద్రణ ద్విపదగీత డాక్టర్ ఫణీంద్ర భక్తభాగ్య రాశి – బాసరేశి, శ్రీ పరదేవతార్చన, శ్రీ లలితాసహస్రనామ పద్యార్చన వైభవం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొరెడి విశ్వనాథశర్మ, తల్లావఝుల మహేశ్‌బాబు, చిత్కల శ్రీనివాసశర్మ, సాయిప్రసాద్, కాసర్ల నరేశ్‌రావు, చింతల శ్రీనివాస్, కందకుర్తి ఆనంద్, పబ్బుమురళి, యశస్విని సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

జెండా బాలాజీ ఆలయంలో అధ్యయనోత్సవం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 25 : ధనుర్మాసం పురస్కరించుకొని నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితులు సముద్రాల శ్రీధరాచార్యులు, కలకుంట్ల శ్రీధరాచార్యులు, జెండా బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యులు తిరుప్పావై, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ ఈవో వేణు మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి 26 వరకు అధ్యయనోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 25 : నగరంలోని గాజుల్‌పేట్‌లో గురుద్వారా వీర్ బాల్ దివస్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుద్వారా సాహెబ్, అఖాలి సేవ జాత సెక్రటరీ చరణ్‌జిత్ సింగ్, సభ్యుడు దర్శన్‌సింగ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్సా ఆంజనేయులు శిబిరాన్ని ప్రారంభించారు. అమరవీరుల త్యాగానికి గుర్తింపుగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా.. 40 మంది యువకులు రక్తదానం చేసినట్లు అఖాలి సేవ జాత సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి కరిపె రవీందర్, డాక్టర్ ఆశిశ్, మెడికల్ ఆఫీసర్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ధర్పల్లి, డిసెంబర్ 25 : మండలంలోని రేకులపల్లిలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేపట్టగా.. చైర్మన్ ముప్పారం నవీన్. సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం వైస్ చైర్మన్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప, సాయిబాబా ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

కోటగిరి, డిసెంబర్ 25 : మండలకేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప, సాయిబాబా ఆలయ నిర్మాణ పనులను యాదాద్రి స్తపతి డాక్టర్ మోతీలాల్ సోమవారం పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ పోల విఠల్ రావు గుప్తా, పల్లెంపాటి శివరామకృష్ణయ్య ఉన్నారు.

యూనివర్సిటీ నేషనల్ హాకీ పోటీలకు తూంపల్లి పీఈటీలు

పోటీలకు ఎంపికైన తూంపల్లి గ్రామానికి చెందిన శిక్షణ పీఈటీలు

సిరికొండ, డిసెంబర్ 25 : హైదరాబాద్‌లోని జీసీపీఈ కాలేజీలో వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణలో ఉన్న తూంపల్లి హాకీ క్రీడాకారులు కె.గిరిచరణ్, ఎల్. వినోద్, ఆర్.సృజన, యూనివర్సిటీ నేషనల్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన యూనివర్సిటీ నేషనల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబర్చి.. తమిళనాడులో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే హాకీపోటీలకు ఎంపికయ్యారు. ఒకే గ్రామం నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపిక కావడంపై వారిని సర్పంచ్ బాలమణీ మల్లేశ్, ఎంపీటీసీ లింగం, వీడీసీ సభ్యులు, జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కార్యదర్శి రమణ అభినందించారు.

సూర్యకిరణ్ సంతాప సభ

సంతాపసభలో మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 25 : ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా కోశాధికారి కోయ్య సూర్యకిరణ్ మహరాజ్ గుండెపోటుతో మరణించగా.. నగరంలోని వినాయక్‌నగర్‌లో సంతాపసభను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ హాజరై సూర్యకిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యకిరణ్ అకాల మరణం పార్టీకి తీరని లోటు అని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర నాయకుడు సుమన్ మహరాజ్, జిల్లా నాయకులు రాజు, నాగేశ్వర్‌రావు, మహిపాల్, సాయినాథ్, మహేందర్, బాగేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్25: మండలంలోని అంకాపూర్ గ్రామంలో మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామి వారిని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయోధ్య రాముని పూజిత అక్షింతల ఊరేగింపు

కమ్మర్‌పల్లిలో అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఇందల్వాయి/ రుద్రూర్/ బాల్కొండ/ కమ్మర్‌పల్లి, డిసెంబర్ 25 : జిల్లాలోని పలు గ్రామాలకు అయోధ్య రాముని పూజిత అక్షింతలు చేరాయి. ఈ సందర్భంగా వాటికి పూజలు చేసి, గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఇందల్వాయి, డిచ్‌పల్లికి అక్షింతలు చేరుకున్నాయి. డిచ్‌పల్లి మండలంలోని హనుమాన్ ఆలయం నుంచి కాశీ విశ్వేశ్వర ఆలయం వరకు అక్షింతలను భక్తులు ఊరేగించారు. తలంబ్రాలను వివిధ గ్రామాలకు పంపించినట్లు బజరంగ్‌దళ్ సభ్యులు తెలిపారు.

బాల్కొండ మండల కేంద్రంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు.

జిల్లాకేంద్రంలో శ్రీరామ తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల కలశానికి సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. నగరంలోని ఆర్యనగర్, వినాయక్‌నగర్, పూలాంగ్ చౌరస్తా, హైదరాబాద్ రోడ్, ఆర్పీ రోడ్ మీదుగా దేవీమాత ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. దేవీమాత ఆలయంలో అక్షింతలకు పూజలు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రతినిధి లక్ష్మీ నారాయణ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో అక్షింతలకు వీడీసీ సభ్యులు, మహిళలు డప్పులు, మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.

రుద్రూర్‌లో 29న అక్షింతల పంపిణీ

రుద్రూర్ మండల కేంద్రంలోని విఠలేశ్వరాలయంలో గ్రామస్తులు సోమవారం సమావేశమయ్యారు. శ్రీరామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 29వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సురేశ్ ఆత్మారాం మహరాజ్ పాల్గొనన్నట్లు తెలిపారు. భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు

కోటగిరి మండలం సోంపూర్‌లో ఊయల సేవలో పాల్గొన్న భక్తులు

కోటగిరి/ ఎడపల్లి/ నందిపేట్, డిసెంబర్ 25 : ఉమ్మడి కోటగిరి మండలంలో ఆదివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పొతంగల్ మండలంలోని సోంపూర్‌లోని గల దత్త మందిరంలో భక్తులు ఉదయం నుంచే పూజలు చేశారు. అనంతరం ఉయ్యాల పాటలు పాడుతూ వేడుకలు నిర్వహించారు.

ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలోని మాణిక్‌ప్రభు మఠంలో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు భజనలు చేస్తూ గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ సుమలత, సురేశ్, మురళీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్ మండలం మారంపల్లిలోని దత్త ఆశ్రమంలో దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దత్త పారాయణం చేశారు. వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్తాబైన దత్త మందిరాలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 25 : జిల్లాకేంద్రంలోని సాయి, దత్త మందిరాలు ముస్తాబయ్యాయి. మార్గశిర పౌర్ణమి, మంగళవారం పురస్కరించుకొని దత్తాత్రేయుడి జన్మతిథి సందర్భంగా దత్త జనన, దత్త పాదుక పూజ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గాజుల్‌పేట సంతాచార్య మఠం, వినాయక్‌నగర్‌లోని సద్గురు దత్త మందిరం, అయ్యప్ప ఆలయం, మాధవ్‌నగర్ సాయిమందిరం, వర్నిరోడ్ దత్త మందిరం... తదితర ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. నగరంలోని షిర్డీసాయి కృపానగర్‌లో ఉన్న దత్త మందిరంలో 5వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని, ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇప్పకాయల హరిదాస్ స్వామీజీ తెలిపారు. నేడు 111 మంది భక్తులతో సామూహిక దత్తపారాయణం చేయనున్నట్లు చెప్పారు. పూజలఅనంతరం అన్నదానం ఉంటుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 25: నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, జెస్సు అనిల్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

నందిపేట్, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయాల్లో భక్తులు అభిషేకం, పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ వార్షికోత్సవంలో పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మోర్తాడ్, డిసెంబర్ 25: మండలంలోని వడ్యాట్ గ్రామశివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను మైన్స్ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. మండల పరిధిలో ఇసుక అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు

వేల్పూర్, డిసెంబర్ 25 : మండలకేంద్రంలో అయ్యప్ప స్వాములు ఆరట్టు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం నుంచి అయ్యప్ప స్వామి ఆలయం వరకు శోభాయాత్ర చేపట్టారు. శోభాయాత్రలో అయ్యప్ప స్వాములు నృత్యాలు చేశారు.

ఏర్గట్లలో పడిపూజ

ఏర్గట్ల, డిసెంబర్ 25 : ఏర్గట్ల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి అలయంలో అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ నిర్వహించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ఖలీల్‌వాడి(మోపాల్)/ఎడపల్లి, డిసెంబర్ 25 : మోపాల్ మండలం సిర్పూర్ గ్రామంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అనంతరం డ్రోన్ ద్వారా నానో యూరియా పొలంలో పిచికారీ చేసే విధానాన్ని అధికారులు ప్రయోగాత్మకంగా వివరించగా, ఎంపీ, స్థానిక రైతులు ఆసక్తిగా తిలకించారు. ఎడపల్లి, దుబ్బతండా గ్రామాల్లో ఎంపీడీవో గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

హైమాస్ట్‌లైట్లను ప్రారంభిస్తున్న సర్పంచ్ వనజాగోవర్ధన్‌గౌడ్, జడ్పీటీసీ లావణ్యావెంకటేశ్

బాల్కొండ, డిసెంబర్ 25 : మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో హైమాస్ట్ లైట్లను సర్పంచ్ వనజా గోవర్ధన్‌గౌడ్, జడ్పీటీసీ లావణ్యా వెంకటేశ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జడ్పీటీసీ నిధులు రూ.లక్షా 25 వేలతో వీటిని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవితా శ్యామ్, బీఆర్ఎస్ నాయకుడు న్యావనంది సాయన్న, ఉపసర్పంచ్ రాజేందర్, ప్రకాశ్, గంగాధర్, హరీశ్, నారాయణ, ఇంకొల్ల రాజన్న, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

'బడాపహాడ్‌లో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి'

వర్ని, డిసెంబర్ 25 : మండలంలోని బడాపహాడ్ వద్ద పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి భక్తులకు రక్షణ కల్పించాలని సీపీఎం వర్ని ఏరియా కన్వీనర్ నన్నేసాబ్ కోరారు. వర్ని ఎస్సై కృష్ణకుమార్‌కు ఈ మేరకు ఆయన సోమవారం వినతిపత్రం అందజేశారు. బడాపహాడ్ పుణ్యక్షేత్రానికి మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని, త్వరలో ఉర్సు నిర్వహించనున్న నేపథ్యంలో పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి భక్తులకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాయిబాబా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘననివాళి

వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ నాయకులు

నిజామాబాద్ క్రైం/ వర్ని/ చందూర్/ నందిపేట్/ బోధన్ రూరల్/ శక్కర్‌నగర్, డిసెంబర్ 25 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. వాజ్‌పేయి పేదల కోసం తపిస్తూ, అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషిచేశారని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకుడు అల్జాపూర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వర్ని మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో, మోస్రా, నందిపేట్ మండల కేంద్రాల్లో ఆ పార్టీ నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోధన్ మండలంలోని కల్దుర్కిలో జననీ యాత్ సొసైటీ ఆధ్వర్యంలో వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. సర్పంచ్ నానాపటేల్, ఎంపీటీసీ లక్ష్మీరాజన్న పాల్గొన్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో బీజేపీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

31 చర్చిలకు కేక్‌ల పంపిణీ

నవీపేట, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని పెంతెకోస్తు చర్చిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నవీపేట విండో వైస్ చైర్మన్ దొంత ప్రవీణ్‌కుమార్ తన సొంత ఖర్చులతో 31 చర్చిలకు కేక్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే షకీల్ సహకారంతో నవీపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, న్యాలకంటి అబ్బన్న, కరిపే మల్లేశ్, లోకం నర్సయ్య, పాస్టర్లు నేహమ్యా, రమేశ్, సుందర్‌రావు, ఏసుదాస్, ఆయా గ్రామాల చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

నవీపేటలో పాస్టర్లకు కేక్‌లను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, DONTHI SOUJANYA, D/o. Donthi Sudhakar, R/o. 5-3-642/2, vidya Nagar Colony, Kamareddy-503 111, TS. Changed My Name as DONTHI SOUMYA, D/o. Donthi Sudhakar. NT-324491

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.